## హరీశ్‌రావును కలిసిన మాజీ జడ్పీటీసీ



హరీశ్‌రావుతో బీఆర్‌ఎస్ నాయకులు

బొల్లారం, మార్చి 23: మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును బొల్లారం బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీసీ కాలనీ యువత మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను బాల్‌రెడ్డి హరీశ్‌రావు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బీరప్ప యాదవ్, బీసీ కాలనీ యువత లడ్డు, గణేశ్, చందు, జాషువా ఉన్నారు.

## ఓటు నమోదు చేసుకోవాలి

న్యాల్‌కల్, మార్చి 23: కొత్త ఓటర్లు ఏప్రిల్ 14వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకోవాలని మండల డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి తెలిపారు. మే 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ బాధ్యత, నిజాయితీగా ఓటు వేసి పోలింగ్ శాతాన్ని పెంచాలన్నారు. 18 ఏండ్లు నిండిన యువతీ,యువకులు తప్పనిసరిగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 85 ఏండ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే ఓటుహక్కును వినియోగించుకునేందు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. వారందరూ ముందుగానే తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## సీఐకి సన్మానం



సీఐ గంగాధర్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

బొల్లారం, మార్చి 23: బొల్లారం మున్సిపల్ నూతన సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గంగాధర్‌ను మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. సీఐ గంగాధర్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ శాంతి భద్రతల స్థాపనకు కృషి చేయాలని కోరారు. కౌన్సిలర్లు గోపాలమ్మ, చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు, లక్ష్మిరెడ్డి, రాజగోపాల్, సంపత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రమణ య్య, చంద్రారెడ్డి, పరుశురాం, వెంకటయ్య, నరసింహ రాజు, వెంకీ పాల్గొన్నారు.

## బీరప్పబస్తీలో ఇఫ్తార్ విందు

బొల్లారం, మార్చి 23: బీరప్పబస్తీ మసీద్‌లో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనార్టీతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. మున్సిపాలిటీలోని మైనార్టీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మైనార్టీలు మాజీ జడ్పీటీసీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మైనార్టీ ప్రతినిధులు ఉస్మాన్, శాబాజ్, రషీద్, ముబీన్, ఖాసీం, ఇమ్రాన్‌ఖాన్, ముక్తర్, పాషాజాషువా పాల్గొన్నారు.

# దుబ్బాకలో చెల్లని రఘునందన్‌రావు
# మెదక్‌లో చెల్లుతాడా?

- రఘునందన్‌రావుపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఫైర్
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిపై చేసిన వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 23: మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిపై బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. శనివారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీ అభ్యర్థితో కలిసి మాట్లాడారు. దుబ్బాకలో చెల్లని రఘునందన్‌రావు మెదక్ ఎంపీగా ఎట్లా చెల్లుతాడని ప్రశ్నించారు. గురిగింజ కింద నలుపు కనిపించదన్న చందంగా బీజేపీ వాళ్ల మాటలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. వెంకట్రాంరెడ్డి కరీంనగర్ వాసి అనడాన్ని తప్పుబట్టారు. వెంకట్రాంరెడ్డి పక్కా లోకల్ అని, గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో డ్వామా పీడీగా, జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉన్నదని గుర్తుచేశారు. రఘునందన్‌రావు రెండు మూడు ముచ్చట్లు మాట్లాడగానే పోటీలోకి వస్తాననుకోవడం భ్రమ అవుతుందన్నారు. బీజేపీ నుంచి హైదరాబాద్‌లోని బంగారు లక్ష్మణ్ సతీమణి రాజస్థాన్‌లో పోటీ చేయలేదా? మోదీ గుజరాత్‌ను వీడి వారణాసిలో పోటీ చేసిన విషయాన్ని మర్చిపోయావా అని చురకలంటించారు. ఈటల రాజేందర్ కరీంనగర్‌ను విడిచి మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేయడం లేదా అని ప్రశ్నించారు. బీజేపీలోని 15 ఎంపీ స్థానాల్లో కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తప్ప మిగతా వారంతా బయట నుంచి వచ్చినవారే అని ఎమ్మెల్యే గుర్తుచేశారు. వెంకట్రామిరెడ్డికి 2002 నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధం ఉన్నదన్నారు. రెండేళ్ల నుంచి జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని చెప్పారు. జిల్లాలో పని చేసిన అనుభవంతో ప్రజా సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్నదని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానలను ఎండగడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తారన్నారు. రాష్ట్రానికి కేంద్రం చేసిన అభివృద్ధి చూపి, కేంద్రం నుంచి ఏం తీసుకొస్తారో చెప్పి ఓట్లు అడగాలన్నారు. బీఆర్‌ఎస్‌పై బురద చల్లే ప్రయత్నం మానుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హితవు పలికారు. వందశాతం మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి, చక్రపాణి, శ్రీనివాస్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



వెంకట్రాంరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, తదితరులు

## ఎంపీ అభ్యర్థికి సన్మానం

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 23: ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. శనివారం సంగారెడ్డికి వచ్చిన వెంకట్రాంరెడ్డిని పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి, చక్రపాణి, శ్రీకాంత్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.



మాడ్గి చెక్‌పోస్టు వద్ద రూ.3లక్షలను స్వాధీనం చేసుకొన్న పోలీసులు

## మాడ్గి చెక్‌పోస్ట్ వద్ద నగదు పట్టివేత

న్యాల్‌కల్/కోహీర్, మార్చి 23: మొగుడంపల్లి మండలం మాడ్గి గ్రామ శివారులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద శనివారం రూ.3 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. ముంబయి-హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారి 65పై ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్రలోని సోలాపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారులో రూ.3 లక్షల నగదును పట్టుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో పోలీసులు నగదును సీజ్ చేశారు. ఎవరి వద్ద అయినా రూ.50వేలకు మించి నగదు ఉంటే తప్పనిసరిగా పత్రాలు కలిగి ఉండాలన్నారు. తనిఖీల్లో చిరాగ్‌పల్లి ఎస్సై నరేశ్, పోలీసులు పాల్గొన్నారు.

## పారిశ్రామికవాడలో కొనసాగుతున్న సర్వే



బొల్లారం పారిశ్రామికవాడలో సర్వే చేస్తున్న సర్వేయర్లు

బొల్లారం, మార్చి 23: పారిశ్రామికవాడలో కబ్జాకు గురైన ఎన్రిచ్ పార్కులపై సర్వేయర్లు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మూడు రోజులుగా రెండు బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్నారు. పారిశ్రామికవాడకు కేటాయించిన ఎన్రిచ్ పార్కులను గుర్తించి సర్వేయర్లు పక్కాగా మార్కింగ్ చేసి రిపోర్టులు తయారు చేస్తున్నారు. ఈమేరకు తయారు చేసిన రిపోర్టులను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు సర్వేయర్లు వెల్లడించారు. సర్వేలో జిన్నారం సర్వేయర్ రామభద్ర, అమీన్‌పూర్ సర్వేయర్ యాదయ్య, మునిపల్లి సర్వేయర్ కోటేశ్వరరావు, గుమ్మడిదల సర్వేయర్ సాయికిరణ్, మున్సిపల్ టీపీవో పవన్, మున్షి నవీన్, ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందరావు ఉన్నారు.

# ఎన్నికల సమాచారాన్ని మీడియాకు అందించాలి

**ఎంసీఎంసీ, మీడియా సెంటర్లను పరిశీలించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి**



ఎంసీఎంసీ, మీడియా సెంటర్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 23: పార్లమెంట్ ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ), మీడియా సెంటర్లను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. సెంటర్‌లో ఏర్పాటు చేసిన సాంకేతికత, మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలు, ఎంసీఎంసీ పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్, కామారెడ్డి జిల్లాల ఎంసీఎంసీ నోడల్ అధికారులతో కలిసి ఎప్పటికప్పుడు ఎంసీఎంసీ సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు మీడియా సహకారం అందించాలని కోరారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాస్థాయిలో ఎంసీఎంసీ ఏర్పాటు ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, పత్రికల్లో ప్రచురించిన రాజకీయ ప్రకటనలు అభ్యర్థి ఎన్నికల వ్యయంలో నమోదు చేస్తామన్నారు. శాటిలైట్ ఛానల్స్, కేబుల్ నెట్‌వర్క్‌లు, సోషల్ మీడియా, ఈ పేపర్‌లో ప్రకటనలు, బల్క్ ఎస్‌ఎంఎస్, వాయిస్ మెసేజ్‌లు ఇతర ఆడియో-వీడియో విజువల్ మీడియాలతో సహా రాజకీయ ప్రకటనలు ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట డీఆర్వో పద్మజారాణి, జిల్లా పౌర సంబంధాల అధికారి ఏడుకొండలు, ఏవో పరమేశ్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

## ముమ్మరంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు



12వ వార్డులో కొనసాగుతున్న అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు

కంది, మార్చి 23: కందిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల మంజూరైన రూ.10లక్షల ప్రత్యేక నిధులతో 12వ వార్డులో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు 70శాతం పూర్తయ్యాయి. లక్ష్మీనగర్, జైల్ రోడ్డు, దర్గా ప్రాంతాల్లో సుమారు రూ.36లక్షలతో సీసీ రోడ్లు వేశారు. మరికొన్ని వార్డుల్లో త్వరలో సీసీ రోడ్లు వేయనున్నారు. వేసవిలో నీటిఎద్దడి సమస్య తలెత్తకుండా కాలనీల్లో పాడైన బోరు మోటర్లకు మరమ్మతులు చేపట్టారు. పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి విద్యాధర్ గౌడ్ తెలిపారు. అండర్ డ్రైనేజీలతో పాటు, తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# పన్యాలలో తాగునీటి కష్టాలు

**పంట పొలాలకు పరుగులు పెడుతున్న పల్లె జనాలు.. ట్రాక్టర్లలో డ్రమ్ముల ద్వారా నీటి తరలింపు**



పన్యాలలో నీటికోసం బిందెలలు, బకెట్లతో గుమిగూడిన ప్రజలు



రాత్రి ట్రాక్టర్‌పై డ్రమ్ముల్లో నీరుతెచ్చుకుంటున్న ప్రజలు

హత్నూర, మార్చి 23: మండలంలోని పన్యాల గ్రామంలో వారం రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో నీటిట్యాంకులు ఉన్నప్పటికీ నీటిని నింపకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. తెల్లవారింది మొదలు సాయంత్రం వరకు నీటి కోసం ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలతో పంట పొలాల వద్దకెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. పగలు, రాత్రి తేడాలేకుండా పనులు మానుకొని మరీ తాగునీటి కోసం పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటికోసం బిందెలు పట్టుకొని కొట్లాటకు దిగుతున్న సందర్భాలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలని పన్యాల గ్రామస్తులు వేడుకుంటున్నారు.



సిల్వర్ కాయిన్స్‌తో రైతు పవన్‌కుమార్

## రైతుకు సిల్వర్ కాయిన్స్

జిన్నారం, మార్చి 23 : యాసంగి సీజన్‌లో గ్రోమోర్ కోరమాండల్ కంపెనీ వారు పెట్టిన స్కీమ్‌లో జిన్నారం శ్రీసాయి శ్రీనివాస ఫెర్టిలైజర్‌లో రసాయన మందులు కొనుగోలు చేసిన రైతు జీళ్ల పవన్‌కుమార్ డ్రాలో 50 గ్రాముల రెండు సిల్వర్ కాయిన్స్‌ను గెలుచుకున్నారు. వీటిని ఫెర్టిలైజర్ దుకాణంలో రైతు పవన్‌కుమార్‌కు శనివారం అందజేశారు. గ్రోమోర్ కోరమాండల్ కంపనీ ప్రతినిధి అఖిల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు కిందపడి యువకుడు మృతి

జీడిమెట్ల, మార్చి 23: ద్విచక్ర వాహనదారుడు ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో బైక్‌పై వెనుక కూర్చున్న మరో యువకుడు బస్సు టైరు కిందపడి మృతి చెందాడు. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎస్ఐ హరీశ్ కథనం ప్రకారం... సంగారెడ్డి జిల్లా హత్నూర్ మండలం దుర్గాపూర్ గ్రామానికి చెందిన కొండారి మల్లేశ్ కుమారుడు కొండారి గణేశ్(23) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బాబాయ్ వెంకటేశ్‌తో కలిసి ఎలక్ట్రికల్ పనులు చేస్తున్నాడు. శనివారం ఉదయం గణేశ్, వెంకటేశ్ ద్విచక్ర వాహనంపై సూరారం నుంచి బాలానగర్ వైపు వెళ్తున్నారు. జీడిమెట్ల హమాలీ అడ్డా వద్దకు రాగానే ద్విచక్ర వాహనం ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న వెంకటేశ్ ఎడమ వైపునకు పడగా, వెనుక కూర్చున్న గణేశ్ బస్సు వెనుక టైరు కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన గణేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# దివ్యాంగుడికి కృత్రిమ కాలు

రామచంద్రాపురం, మార్చి 23: తెల్లాపూర్ మున్సిపాలిటీ వెలిమెల తండాలో ఉం టున్న చింటూ నాయక్‌కు రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలు పోయింది. దీంతో ఏండ్లుగా ఒంటి కాలితో జీవిస్తున్నాడు. ఇటీవల వైస్‌చైర్మన్ రాములుగౌడ్‌ను కలిసి తనకు కృత్రిమ కాలు పెట్టించాలని కోరాడు. స్పందించిన ఆయన తనయుడు, బీఆర్‌ఎస్ యువ నాయకుడు సాయిచరణ్ గౌడ్ చింటూ నాయక్‌కి కృత్రిమ కాలు పెట్టించారు. దీంతో తండావాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాయిచరణ్ గౌడ్ మాట్లాడుతూ ఒంటి కాలుతో జీవిస్తున్న చింటూ నాయక్‌కు కృత్రిమ కాలు పెట్టించడం సంతృప్తినిచ్చిందన్నారు.



దివ్యాంగుడికి కృత్రిమ కాలు పెట్టించిన బీఆర్‌ఎస్ నాయకుడు సాయిచరణ్ గౌడ్

# అమరవీరులకు ఘన నివాళి




భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 23: స్వాతంత్య్ర ఉద్యమంలో పోరాడి ప్రాణాలర్పించిన భారతమాత ముద్దుబిడ్డలైన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్‌ఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కళాశాలలో అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లను 1931 మార్చి 31న లాహోర్ జైల్లో బ్రిటీష్‌వారు ఉరి తీశారన్నారు. వారి ఆశయాలను స్మరించుకుంటూ అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చెప్పారు. లాలాలజపతి రాయ్ బ్రిటీష్ వారి లాఠీచార్జితో చనిపోయారని గుర్తు చేశారు. అందుకు కారణమైన బ్రిటీష్ అధికారి జేమ్స్ స్కాట్‌పై దాడి చేసేందుకు ముగ్గురు వీరులు ప్రయత్నించి పట్టుబడ్డారన్నారు. వారి త్యాగాలను గుర్తించుకొని నవ సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు ప్రవీణ, డాక్టర్ వెంకటేశం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పద్మజ, డాక్టర్ సిద్దులు, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ అభిజిత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బీఆర్‌ఎస్ కార్యకర్త ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 23: మండలంలోని పాతన్‌పల్లి(ఆర్)కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త నీరుడి సాయిలు అనారోగ్యంతో సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి శనివారం పరామర్శించారు. సాయిలుకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి సాయిలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మాజీఎమ్మెల్యే వెంట రవీందర్‌నాయక్, నర్సింహులు, కృష్ణ, లక్ష్మణ్‌నాయక్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**SERVICES**

★మీరు కోర్టు కేసులతో బాధ పడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? మీ కేసులు మీరే వాదించుకోండి. మేము మీకు న్యాయ సలహాలు ఇస్తాము. GLS, L.B.Nagar, Hyd. 7893011777.
NT-311873-All

**WANTED**

★ఇంటర్, డిగ్రీ చదివి ఖాళీగా ఉన్న వారికి కంప్యూటర్ & ఇంగ్లీష్ కోర్సులు నేర్పి, కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు చూపించబడును. 7997997364/5.
NT-327958-All

**CHANGE OF NAME**

★I, BAIKADI NARAYANA, S/o. Baikadi Yellaiah, R/o. H.No. 4-34, Habsipur, Dubbak Mandal, Siddipet Dist., Telangana State, have Changed My Name as BAIKADI NARAYANA REDDY.
NT-311815

★I, TATIKONDA LAKSHMI, W/o. Tatikonda Ramesh (Old Name), R/o. H.No. 19-78/1, Ramayampet (V&M), Medak (D). I have Changed My Name, My Husband Name as THATIKONDA LAKSHMI, THATIKONDA RAMESH (New Name).
NTZ-324668





**డాక్యుమెంట్ పోయినది**

మెత్రి రమేష్ తండ్రి మెత్రి హూలప్ప R/o. నాగల్‌గిద్ద గ్రామం, నాగల్‌గిద్ద మండలం, సంగారెడ్డి జిల్లా వాసినైన నేను తేది: 16-03-2024 రోజున నాగల్‌గిద్ద నుండి నారాయణఖేడ్‌కు RTC బస్సులో ప్రయాణిస్తుండగా మార్గమధ్యలో నాయొక్క ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ నం. **4799/2018 & 4800/2018** గలవి పోయినవి. ఎవరికైన దొరికినచో సంప్రదించగలరు: **9848767820**

## మహిళను హత్య చేసిన దొంగస్వామీజీ రిమాండ్

గుమ్మడిదల, మార్చి 23: పూజలు చేస్తానని నమ్మించి మహిళను హత్య చేసిన దొంగ స్వామీజీని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. జిన్నారం సీఐ సుధీర్‌కుమార్ కథనం ప్రకారం..గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీరన్నగూడెంలో వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో పూజా సామగ్రి దుకాణం పెట్టుకొని జీవిస్తున్న బుచ్చమ్మను వెకిర్యాల గ్రామం, బీబీనగర్ మండలం, యాదాద్రిబబోనగిరి జిల్లాకు చెందిన తత్తరి నర్సింగ్‌రామ్(నర్సింగ్‌రావు)శివ స్వామీజీగా పరిచయమయ్యారు. గతనెల 13న పూజలు చేస్తానని బుచ్చమ్మ(60)ను నమ్మించి సికింద్రాబాద్ తీసుకెళ్లి పూజకు అవసరమైన సామాగ్రి కొనుగోలు చేసి ఘట్కేసర్ పరిధిలోని మాదారం శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి పూజలు చేస్తూ మెడ నుంచి బంగారు గొలుసును తీయమని అనగా ఆమె దానికి నిరాకరించడంతో దొంగస్వామీజీ తలపై బలంగా కొట్టాడు. చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత బంగారు గొలుసు తీసుకొని పారిపోయాడు. ఇంతకుముందు కూడా దొంగస్వామీజీ అవతారమెత్తి పలువురిని మోసం చేశాడు. ఇతడిపై హన్మకొండ, ముషీరాబాద్ పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి. దొంగస్వామీజీని చాకచక్యంగా పటుకున్న ఎస్సై మహేశ్వర్‌రెడ్డి, ఏఎస్సై పర్వేజ్, కానిస్టేబుల్ వెంకటేశం, సికిందర్, కిశోర్‌లను ఎస్పీ అభినందించారు.



మహిళను హత్యచేసిన దొంగస్వామీజీని రిమాండ్‌కు తరలిస్తున్న సీఐ సుధీర్‌కుమార్, ఎస్సై మహేశ్వర్‌రెడ్డి

# ప్రమాదాల నివారణకు కంది చౌరస్తా మూసివేత

కంది, మార్చి 23: ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై ఉన్న సిగ్నల్ చౌరస్తాను శనివారం మూసివేశారు. జాతీయ రహదారికి ఇరువైపులా కంది గ్రామం ఉండడంతో నిత్యం రహదారి దాటాల్సిన పరిస్థితితోపాటు శంకర్‌పల్లి వైపు రోజుకు వేలసంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. కంది నుంచి శంకర్‌పల్లి, శంకర్‌పల్లి నుంచి పటాన్‌చెరు వైపు వెళ్లాలంటే జాతీయ రహదారి మీదుగా యూటర్న్ తీసుకోవాలి. ఈ రహదారిపై వెళ్లే వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు నరకయాతన పడుతున్నారు. గతంలో ఈ చౌరస్తాలో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకొని ప్రాణనష్టం జరిగిన ఘటనలూ ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి సిగ్నల్ చౌరస్తాను మూసివేశారు. జాతీయ రహదారిని అనుకొని ఉన్న పల్లెప్రకృతి వనం, సీసీఎస్ ఎదుట రెండు యూటర్న్‌లు ఏర్పాటు చేసి వాహనాలను మళ్లిస్తున్నారు.



కంది జాతీయ రహదారిపై ఉన్న సిగ్నల్ చౌరస్తాను బారికెడ్లతో మూసివేసిన పోలీసులు